ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 17

## దివ్యానుభవాలు



**రాక్షస సంహారంతో భూభారాన్ని తగ్గించి ఋషులను అనుగ్రహించేందుకు రాముడు అవతరించాడు. అట్లే మహాభారత యుద్ధం ద్వారా భూభారం తగ్గించుటకునూ, అర్జునుడు, ఉద్ధవుడు, యశోద, గోప గోపికలననుగ్రహించుటకునూ శ్రీ కృష్ణుడు అవతరించాడు.**

**ఇదే విధంగా చరిత్ర పొడవునా ముముక్షువులకు ఆధ్యాత్మిక ప్రబోధాన్నందించి దివ్యానుభవాలతో ప్రోత్సహించి కృతార్థులను**
**41 చేయడానికి, దీన జనోద్ధరణ కొరకు భూమి మీద పరిపూర్ణులైన మహనీయుల రూపంలో ఆ పరమాత్మ అవతరిస్తూ వుంటారు. అట్టి మహనీయులను ముముక్షువులు ఆశ్రయించి తీరాలని ఉపనిషత్తులు భగవద్గీత చెపుతున్నవి. అర్జునుడు, ఉద్ధవుడు శ్రీ కృష్ణుణ్ణీ, శ్రీ కృష్ణుడు సాందీపని మహర్షిని, శ్రీ రాముడు వశిష్ఠునీ ఆశ్రయించడం ద్వారా మనకీ రహస్యం తెలుస్తుంది. కారణం సకల శాస్త్రాల సారాన్నీ మహనీయులు బోధించడమేగాక మనం విశ్వసించలేని విషయాలను ప్రత్యక్షానుభవం ద్వారా తెల్పగలరు. విశ్వరూపసాక్షాత్కారం ద్వారా శ్రీకృష్ణుడు అర్జునుడికి చేసిన ఉపదేశమిదే.**

అటువంటి అనుభవాలే దత్తాత్రేయ స్వరూపులైన శ్రీ శిరిడీ సాయిబాబా, అక్కల్‌కోట స్వామి వంటివారు తమ భక్తులకనుగ్రహించటం వారి చరిత్రలో చూడవచ్చు. వారికి ముందు అవతరించిన దత్తాత్రేయవిశేషాలను 'శ్రీ గురుచరిత్ర' గూడ చక్కగా వివరిస్తుంది. ఇటువంటి మహనీయులలో మనకిటీవల వరకూ లభించిన అవధూత శ్రీ వెంకయ్యస్వామివారు ఒకరు. నిజానికి మిగిలిన దత్తావతార పురుషుల చరిత్రలు శ్రద్ధతో పరిశీలిస్తేగాని శ్రీ వెంకయ్యస్వామి మహిమ మనకు పూర్తిగా అర్థంగాదు. ఈ మాటలోని సూత్రాన్ని తెలియకుంటే ఆయన ఒక వెర్రివారనో, లేక కేవలం ప్రశ్నలు

చెప్పుకొని జీవించే ఒక సామాన్య సాధువనో మనం భ్రమించే అవకాశమున్నది. మిగిలిన దత్తావతారముల వలె అవధూత శ్రీ వెంకయ్యస్వామివారు భక్తులకనుగ్రహించిన దివ్యానుభవాలను ఈ అధ్యాయంలో చూస్తాము.

ముదిగేడు వాస్తవ్యులు అక్కిం వెంకట్రామిరెడ్డిగారు ఇలా చెపుతున్నారు. ఒకసారి శ్రీస్వామివారు ముదిగేడు వచ్చారు. అదేమోగాని, ఆయన నా పేరు మార్చి 'సుబ్బరామయ్యా! నీవు నాకు తలుపూరుకు త్రోవ చూపిస్తువు, రావయ్యా!' అని నన్ను బయలుదేర తీశారు. తక్కిన వారందరూ నిద్రపోతున్నారు. మేము కొంతదూరం వెళ్ళి కొక్కెరాళ్ళ గుట్ట దగ్గరకు చేరాము. శ్రీస్వామివారు నన్నక్కడ కూర్చోమని చెప్పి ఆ గుట్టను తొక్కితే మెత్తబడుతుందని, తాము వెళ్ళి ఆ పనిచేసి వస్తామని చెప్పి వెళ్ళారు. ఆయన ఏమి చేస్తారో చూడాలని కొద్ది సేపటికి నెమ్మదిగా వారిని సమీపించి ఒక ప్రక్కన దాక్కున్నాను. ఆయన ఆ గుట్టపైకి ఎక్కి ఒక పెద్ద బండ మీద వెల్లకిలా పడుకొని కాలు మీద కాలు వేసుకొని ఊగించుకుంటూ పాటలు పాడుకుంటున్నారు. నేను వారి పాట వినాలని చిన్నగా నక్కి నక్కి పారాడుతూ ఆ బండ క్రిందచేరి కూర్చున్నాను. ఆయన వెంటనే అది పసిగట్టి, 'పెనుభూతాలు తిరిగే ఈ ఝామున నీవిలా రావచ్చయ్యా?' అన్నారు. నేనపరాధం చేశానేమోనని భయమేసింది. వెంటనే శ్రీస్వామివారు 'అఘోరించావులే, పడమరగా నున్న ఆవుల మందను చూడు!' అన్నారు. చూస్తే సుమారు మూడు మైళ్ళు విస్తీర్ణంగా సందు లేకుండా ఆవుల మందలు కనిపిస్తున్నాయి. పట్టపగలల్లే వెలుగు ఆవరించినది. మగవాళ్లు కొంతమంది ఆవులకు పాలు తీస్తుంటే ఎందరో గోపికా స్త్రీలు పాలు నెత్తిన పెట్టుకొని పోతున్నారు. ఆ దృశ్యాన్ని చూస్తున్నంత సేపూ నాకు దేవలోకంలో విహరిస్తున్నట్లనిపించింది. నేను కూడా ఒక పాలకుండ తీసుకుపోయి వారికందించివస్తాను' అన్నాను. 'ఓయబ్బో! వాళ్ళు రేపల్లె వాడకెత్తుకుపోతుంటే, మరోవంక ప్రొద్దు మొలిచి వస్తుంటే నీ వెక్కడికయ్యా పోయేది?' అన్నారు. అప్పుడు నేను తూర్పు పడమరలు చూస్తే అంతా అంధకారంగా వున్నది. వెనకటి దృశ్యమే లేదు. పోదాము పదయ్యా! తలుపూరుకు పోయి గుర్తులేసుకోవాలి' అని శ్రీస్వామివారు బయలుదేరదీశారు.

నన్ను సాయంత్రం వరకూ తలుపూరులో తమతో కూడా వుంచుకున్నారు. అన్నం, నీరు తీసుకోకుండా ఇద్దరమూ అలాగే వున్నాము.

తరువాత నన్ను ఊరికి పొమ్మన్నారు.

ఒకసారి తలుపూరు గ్రామంలో ఈశ్వరనాయుడు గారింట్లో శ్రీస్వామివారు వేంచేశారు. అది వర్షాకాలం. శ్రీస్వామివారు అర్ధరాత్రి వరకూ కాగితాల మీద తమ వ్రేలి ముద్రలు వేస్తున్నారు. ఆ గృహస్థు ఈశ్వరనాయుడు ప్రొద్దుపోయిందని చెప్పి శ్రీస్వామివారిని, నన్ను భోజనం చేయమని చెప్పాడు. అప్పుడు శ్రీస్వామివారు 'అయ్యో, మండలాలు తగ్గి వచ్చాయి. కొమ్ము కట్టదు. నీవు నీ ఊరికి పోయ్యా!' అని వెంకట్రామిరెడ్డిని ఆదేశించారు. కాని అక్కడున్న చలమానాయుడు శ్రీస్వామివారితో తనకు గల అతి చనువును పురస్కరించుకొని, ఇప్పుడు అర్ధరాత్రి ఇంత వర్షంలో ఆయనను ఊరికి పొమ్మంటావే! నీ జీవం కోసం వర్షంలో ఆయనెక్కడపోతాడు? అని గద్దించి, ఒక మొండి గొడ్డలి తీసుకొని శ్రీస్వామివారి మీద కురికాడు. అప్పుడాయన, 'అబ్బో! ఆయనిక్కడుండ కూడదయ్యా!' అన్నారు. మిగిలిన వివరం అక్కిం వెంకటరామిరెడ్డి చెబుతున్నారు.

"శ్రీస్వామివారి మాట జవదాటని నేను అర్ధరాత్రి వేళ వర్షంలో నెత్తిన గుడ్డ కప్పుకొని మా ఊరు బయలుదేరాను. తలుపూరు గ్రామ పొలిమేరదాకా నాకంతా తెలుస్తూనే వున్నది. ఆ తర్వాత నేనెక్కడున్నానో, ఏమి చేస్తున్నానో నాకేమీ తెలియలేదు. ఏ దోవన వచ్చానో, కళ్ళేరులో నీరు ఎంత లోతున్నది కూడా నాకు తెలియలేదు. మా ఇంటి దగ్గరకు వచ్చేటప్పటికి మా వాకిట్లో మా ఊరి ఆంబోతు రంకె వేయడంతో నాకు తెలివి వచ్చింది. నేను మా ఊరు చేరాననీ, అది మా ఇంటి గడపనీ, రంకె వేసింది మా ఊరి ఆంబోతని అర్థమైంది. అదొక విచిత్రమైన అనుభూతి. వర్షాకాలంలో నిండుగా ప్రవహిస్తున్న 15 అడుగుల లోతు కళ్ళేరును నాకు వళ్ళు తెలియని స్థితిలో దాటించి ఇల్లు చేర్చారు శ్రీస్వామివారు. ఆ మహనీయుని దివ్యశక్తిని కొనియాడ వేయి శిరస్సుల ఆదిశేషునకైనా తరము గాదు!

"మరొకసారి 'కొండ చుట్టూ త్రొక్కి రావలయ్యా' అని చెప్పి శ్రీస్వామివారు మా అందరినీ, ఎనిమిది మందిని, కాలినడకన పెంచలకోనకు తీసుకుపోయారు. అక్కడ మాలో కొందరు భక్తులు అన్నము, ధుని సిద్ధం చేస్తుండగా శ్రీస్వామివారు 'అయ్యా! మన వాళ్ళు పనులు చేస్తుంటారు. మనం మల్లెంకొండకు పోయి వస్తాం రా!' అని నన్ను పిలిచారు. 'మీరెక్కడికి

రమ్మంటే అక్కడికి వస్తాను' అని చెప్పి వారితో బయలుదేరాను. సుమారు మూడు మైళ్ళలోవున్న మల్లెంకొండ చేరాము. అక్కడ మల్లీశ్వరుడనే లింగాకారమున్నది. శ్రీస్వామివారు దాన్ని సమీపించి, నాకర్థంకాని వింతైన భాషలో ఆ లింగాకారంతో మాట్లాడారు. అక్కడ నుండి సుమారొక మైలు దూరంలోవున్న మామిళ్ళ కోనకు పోయాము. అక్కడ శ్రీస్వామివారు ఒక బిలంలో దిగుతూంటే నేను కూడా అనుసరించాను. ఆ బిలంలో ఎటు చూచినా దట్టమైన మామిడి వనమున్నది. క్రిందంతా మామిడి పండ్లు మూరెడెత్తున రాలి వున్నాయి. చెట్లమీద గూడా పండ్లు గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతున్నాయి. మేమిద్దరమూ ఆ పండ్లను తొక్కుకుంటూనే మూడు మైళ్ళు ప్రయాణం చేశాము. మేము ఆ కొండ గుహ చివరకు చేరుతుండగా ఒక పెద్ద ఎలుగుబంటి గాండ్రిస్తూ పైకి లేచింది. దాని కోరలు సుమారు మూడంగుళముల పొడవున్నాయి. మనిషిని అమాంతం మింగేటంతగా నోరు తెరచి మా మీదకు వస్తున్నది. ముందు శ్రీస్వామివారు, వెనుక నేను పోతున్నాము. నేను భయపడి ఒక మామిడి చెట్టు చాటుకు వెళ్ళి చూస్తున్నాను. శ్రీస్వామివారు చిటెకలేస్తూ నుచ్చరకొడుతూ (అంటే కుక్కను పిలిచినట్లు చప్పుడు చేస్తూ) దాని దగ్గరకు పోయి తమ కుడిచేతితో దాని నెత్తిపై నుండి వీపు మీదుగా తోక చివర వరకు మూడు సార్లు నిమిరారు. వెంటనే ఆ ఎలుగుబంటి క్రిందకు వంగి వారి పాదాల వద్ద తల పెట్టి లేచి ఒక కొండచరియలోకి వెళ్ళిపోయింది. నేను వెంటనే శ్రీస్వామివారి చెంతకు చేరాను.

"అక్కడొక బాట, ఒక ఈశ్వర లింగము, రెండు స్త్రీ విగ్రహాలూ వున్నాయి. కొండపై నుండి ఆ మూడు శిలల మీద మూడు నీటి ధారలు పడుతున్నాయి. ఎవరో పసుపు, కుంకుమ, పత్రితో వాటి నర్చించినట్లు ఆ ప్రాంతమంతా సువాసనతో నిండిపోయింది. శ్రీస్వామివారు తమ ఎడమ చేతితో కర్ర పట్టుకొని ఆ విగ్రహాలతో ఏదో చిత్రమైన భాషలో మాట్లాడారు. ఇంతలో సుమారు మూడు బారల దూరంలో ఆగ్నేయంగా వున్న నీటికుండము దగ్గరకు వెళ్ళాను. ఆ కుండానికి ఉత్తరం దక్షిణ దిక్కులుగా రెండు మామిడి చెట్లున్నాయి. దట్టమైన వాటి కొమ్మలు పెనవేసుకొని క్రిందకి వంగియున్నవి. నేను ఉత్తరంగానున్న చెట్టును పట్టుకొని కుండంలోకి తొంగి చూచాను. అందులోని నీరు చెప్పలేనంత లోతుగా వున్నది. దానిలో బంగారు, వెండి నాణాలు రాసులు రాసులుగ వున్నాయి. నేనలా చూస్తూవుండగా పడమటి

నుండి ఒక పెద్ద చేప తల కుండంలోకి ప్రవేశించింది. దాని పెదవులకు, మొప్పలకూ బంగారు పోగులు వేసినట్లున్నాయి. దాని తల ఏనుగు తలంత వున్నది. ఆ మొప్పలు తలుపు రెక్కలంత వున్నవి. ఆ చేప తన మొప్పల నాడించే సరికి నీరు వరవరమంటూ నురుగులు చిమ్ముతూ పైకి పొంగింది. నేను భయంతో శ్రీస్వామివారి వద్దకు పరుగెత్తి 'స్వామీ! అందులో నీరు పొంగుతోంది. మనం బయటకి ఎట్లా పోతాము?' అన్నాను.

"ఆయన, 'అదెంతలేయ్యా!, అడ్డేలు (వేలు వెడల్పంత) లోతేలే!' అన్నారు. అక్కడ నుండి మేము మూడు మైళ్ళూ ఆ కుండంలోంచి పొర్లుతున్న అడ్డేలు లోతు నీటిలో నడచి బయటికొచ్చాము. అచ్చట కొండరాళ్లు, చెట్లు యథాప్రకారమున్నాయి. మేము పెంచలకోన చేరాము. శ్రీస్వామివారు మమ్ములనందరినీ 'మీరు తెగచర్ల మీదుగా కుల్లూరు రండి, నేను సాధువయ్యగారిని కలుసుకొని వస్తాను' అని చెప్పి కొండల్లోకి వెళ్ళిపోయారు. అన్నింటికంటే దగ్గర దారి అయినప్పటికి మేము కుల్లూరు చేరేసరికి శ్రీస్వామివారు తమ భక్తుడైన పెద్దయ్యగారి ఇంటి ముందు ధుని వద్ద వేలిముద్రలు వేస్తూ కూర్చొని యున్నారు. శ్రీస్వామివారు నన్ను పిలిచి 'నీ పేరు మారిపోయింది. నీకు నిందలు వచ్చాయి. వెంటనే ఇంటికిపో!' అన్నారు.

"నాకు తులశమ్మగారు చార్జీలకు రూ. 2/- లు ఇచ్చారు. నేను ఇల్లు చేరేసరికి అక్కడ ఊరి జనమంతా గుమిగూడియున్నారు. వారంతా నన్ను ఆశ్చర్యంతో చూచారు. విచారించగా గొడ్లకాపరి పిల్లలు నన్ను చంపి చాపలో చుట్టి ఈత చెట్లలో దాచారని పుకారు పుట్టిందట. అందరూ నా శవాన్ని తేవడానికి గుమిగూడారని తెలిసింది. అందరూ వెళ్ళి ఈతచెట్ల దగ్గర చూస్తే ఒక పాత చాప మాత్రమే వున్నది. శ్రీస్వామివారి మాటలు నాకప్పుడర్థమయ్యాయి.

"ఒకసారి గొలగమూడిలో శ్రీస్వామివారితో కలసి కొన్ని రోజులున్నాను. ఒకనాటి రాత్రి సుమారు పన్నెండు గంటల ప్రాంతంలో శ్రీస్వామివారెక్కడికో ఒంటరిగా బయలుదేరి పోతున్నారు. నా అలవాటు ప్రకారం నేను గూడా వారికి తెలియకుండా వారి వెనకాలే బయలుదేరాను. శ్రీస్వామివారు నాగులవరం అనే అడవిలోకి పోయి అక్కడ 'పెగడ్రాజుగుంట' అనేచోట ఆగారు. నేనా సమీపంలోని విడవలి ('తుంగ') తుప్పల చాటున దాగి కూర్చున్నాను. శ్రీస్వామివారు ఆ గుంట దగ్గర కొంచెం సేపాగి, నేను

దాగియున్న చోటుకు వచ్చి, 'నేను ఎన్నిసార్లు చెప్పినా నీవు చాటుగా వస్తూనే వుంటావు. ఇది ఎటువంటి గంద్రకత్తెర కాలమనుకున్నావ్?' అని నన్ను మందలించి, ఒక దిక్కుగా చూడమన్నారు. అక్కడ పెద్ద చింతమాను మొద్దులంత పెద్దపాము ముక్కలుగా నరికివేయబడియున్నది. 'పైవాళ్ళు దానినలా చేయకపోతే నిన్నూ, నన్నూ అది ఏమి చేసియుండునో? నీవిలా ఎప్పుడూ రాకూడదు' అని నన్ను తిప్పి పంపించేశారు. నేను ఊరిలోకి వచ్చేశాను. ఉదయం ఏడు గంటలకు శ్రీస్వామివారు కొన్ని కట్టెలు, నాగజెముడు బొంతలు కట్ట కొట్టుకొని తీసుకు వచ్చారు.

"శ్రీస్వామివారు అర్ధరాత్రి బయలుదేరి యథేచ్ఛగా సంచరిస్తుండేవారు. ఒకసారి మంచి వర్షాకాలంలో బ్రహ్మాండమైన ఉరుములూ, మెరుపులతో వర్షం పడుతోంది. ఆ కటిక చీకటిలో శ్రీస్వామివారు ఒక తాటిఆకు నెత్తిన పెట్టుకొని ధుని దగ్గర నుండి బయలుదేరారు. ఆయనెక్కడికి పోతారో, ఏం చేస్తారో కనిపెట్టదలచి నేను వారికి కనపడకుండా వెనుకనే నడిచాను. ముదిగేడు దగ్గరున్న కళ్ళేరు ఒడ్డునున్న చాకిరేవు దగ్గరకుచేరి, స్వామి తమ గుడ్డవిప్పి గట్టున పెట్టారు. గట్లనిండుగా తన్నుకొని ప్రవహిస్తున్న కళ్లేరు నీటిపైన శ్రీస్వామివారు చిన్న పిల్లాడిలా పరుగులెత్తుతూ నీళ్ళు వెదజల్లుతున్నారు. మనకర్థంకాని భాషలో తమలో తామే ఏదో మాట్లాడుకుంటూ, ఆవతలి ఒడ్డు నుండి ఇవతలి ఒడ్డుకు తిరుగుతున్నారు. కొంత సేపయ్యాక గట్టునున్న గుడ్డలు ధరించి నేను దాగియున్న తాటిచెట్ల దగ్గరకే వచ్చి, తమ చేతికర్రతో నన్ను పొడుస్తూ, 'రాక్షస లగ్నంలో నీవిలా రావచ్చా?' అని, ఆ కర్రను నా మెడ మీద పెట్టి నెట్టుకుంటూ ఇంటికి తీసుకొచ్చారు. మేము ఇల్లు చేరగానే ఆయన ఏమీ ఎరుగనట్లే తమ ధుని దగ్గర కూర్చున్నారు. నేను కూడా నేరుగా పోయి పడుకున్నాను.

"నేనపుడు ముదిగేడులో ఒక పూరిపాకలో వుండేవాడిని. నాకు ఇల్లు కట్టుకునే శక్తి లేదు. ఒకరోజు శ్రీస్వామివారు నన్ను ఇల్లు కట్టుకోమని చెప్పి తమ స్వహస్తాలతో శంఖుస్థాపన చేశారు. తరువాత పని ఎలా పూర్తి చేయాలని నేను ఆందోళన పడుతుంటే 'నీవు నేరుగా ఈ దిక్కుగా రోడ్డు మీద పోతుంటే, నీ పనులన్నీ నెరవేరుతాయి' అని చెప్పారు. నేనా దిక్కుగా బయలుదేరి పోతుంటే బేలుదార్లు, ఇటుక కోసేవారు, వాటిని తోలే బండివారు దారిలో కనిపించి, 'ఎక్కడికి పోతున్నావు' అని అడిగి, 'మేమే వచ్చి ఆ పని చేస్తాము' అని చెప్పి,

నా పని పూర్తి చేసి పోయారు. మిత్రులు నేనడుగకున్నా ఇంటి దగ్గరకు పైకము తెచ్చి ఇచ్చి నా పని పూర్తిచేయించారు. అందులో నాకెలాంటి ప్రమేయమూ లేకుండానే ఇల్లు పూర్తి అయినది. కొంత కాలానికి శ్రీస్వామివారు మా ఇంట్లోకొచ్చి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఇంటిలో ధుని వేశారు. అందరి ఇండ్లకంటే మా ఇల్లే బాగా వున్నదని గ్రామంలో అందరూ అంటారు. అంతా స్వామి దయ!" (పూర్తి వివరములు 'స్వామిసన్నిధి' లో చూడవచ్చు).

ఒకప్పుడు కొందరు భక్తులు కాశీ యాత్ర పోవాలనుకున్నారు. వారి స్నేహితురాలైన వల్లపురెడ్డి తులశమ్మను తమతో గూడా యాత్రకు రమ్మన్నారు. ఆమె శ్రీస్వామివారిని కూడా యాత్రకు రమ్మని ప్రార్థించింది. 'వాళ్ళను పోనీయమ్మా! మనం రేపు పోదాము' అంటూ నాలుగు రోజులు గడిపారు శ్రీస్వామివారు. శ్రీస్వామివారు వచ్చే మాట ఉత్తదేనని తులశవ్వ అలిగి ఆ రాత్రి అన్నం తినకుండా పోయిపడుకున్నది. ఉదయం ఎనిమిది గంటలైనా లేవలేదు. భక్తులు తట్టి లేపారు. "నేనేమిటి, ఇక్కడున్నాను?" అని ఆమె లేచింది. రాత్రంతా తాను కాశీ యాత్ర చేసినట్లు స్వప్నంలో దర్శనమైందని ఆమె ఎంతగానో వివరించి చెప్పింది. సాక్షాత్తు తనను శ్రీస్వామివారు యాత్రచేయించినట్లు ఆమె తలచింది. అది ఏదో కాకతాళీయమైన స్వప్నమని, కల నిజమైన యాత్ర ఎలా కాగలదని భక్తులందరూ అన్నారు. ఒక నెల తరువాత యాత్ర నుండి వచ్చిన భక్తులకు ఎక్కడెక్కడ ఏమేమి వున్నదీ ఆమె వివరించింది. అది విని వారాశ్చర్యపోయి శ్రీస్వామివారు ఆమె చేత నిజంగా యాత్ర చేయించారని అందరూ గుర్తించారు. ఈ లీల యొక్క అంతరార్థం పూర్తిగా అర్థంగావాలంటే "శ్రీ గురుచరిత్ర" లోని కొన్ని లీలలు చూడాలి.

శ్రీస్వామివారు గుండానికి చాలా సమీపంలో పడుకొనేవారు. గొలగమూడి ఆశ్రమంలో చింతచెట్టు క్రింద గురవయ్య శ్రీస్వామివారి దగ్గరగా పడుకొనియున్నాడు. అందరూ నిద్రపోతున్నారు. కొందరు దిగంబరులైన ఋషులు వచ్చి శ్రీస్వామివారి చుట్టూరా కూర్చొని మాట్లాడుతున్నారు. గురవయ్యకు మెలుకువ వచ్చి గుండం సరిచేయడానికి వెళ్లాడు. 'ఏమయ్యా! ఇప్పుడు లేచావు?' అన్నారు శ్రీస్వామివారు. అంతటితో మైకం వచ్చి గుండం దగ్గర అతడు పడిపోయాడు! ఋషీశ్వరులు వెళ్ళేంత వరకూ లేవలేదు.

ఒకసారి శ్రీస్వామివారు, రాజుపాళెం జయరామయ్య కలిసి బద్వేలు

తిప్పమీదుగా వెడుతున్నారు. 'ఆకాశంలో వెళుతున్న వారిని చూడండయ్యా!' అన్నారు శ్రీస్వామివారు. ఎవ్వరూ కనిపించలేదన్నాడు జయరామయ్య. అప్పుడు శ్రీస్వామివారు అతని కళ్ళను తాకి మరలా చూడమనగా ఆయనకు చాలా పొడవైన మనుష్యులు ఆకాశంలో నడుస్తూ కన్పించారు. తిరిగి శ్రీస్వామివారు అతడి కళ్ళను తాకడంతో ఆయనకా దృశ్యం అంతరించి పరిసరాలు తెలిసాయి.

ఒకప్పుడు వక్కెమ్మ ఆంజనేయస్వామి గుడికి వెళ్ళినప్పుడు అక్కడ దేవతలందరూ సభ చేసినట్లు దర్శనమైంది. ఆ దృశ్యం చూచిన ఆమె ఆ వైభవం చెప్పనలవి కాదని అంటుంది. బ్రహ్మ బొమ్మలు చేసి, నొసటన శిరస్సున వ్రాస్తున్నట్లూ, ఒక స్త్రీ మూర్తి ఆ బొమ్మలలో గల లోపాలను మట్టి పూసి సరిచేస్తున్నట్లు దర్శనమైందట. ఇటువంటి దర్శనం కేవలం భ్రాంతి మాత్రమనడానికి వీలులేదు. విశాఖపట్టణంలో యాసిన్ బాబా అనే ముస్లిం మహాత్ముడు సోమయ్య అనే ఒక భక్తునికి ఇలాంటి దర్శనము ప్రసాదించాడు.

వక్కెమ్మ ఒకనాడు శ్రీస్వామివారికి కొంత దూరంగా నిలబడి ఉన్నది. శ్రీస్వామివారు ఆమెను ప్రేమగా దగ్గరకు పిలిచారు. దగ్గరకొస్తే అచ్చట శ్రీస్వామివారి స్థానంలో తీగపై వేణువు ఊదుతున్న కృష్ణుడు నాట్యం చేస్తూ కనిపిస్తున్నాడు. ఆనందభాష్పాలు రాలుస్తూ తన్మయంగా కొంతసేపు చూచింది. తరువాత ఆ స్థానంలో శ్రీస్వామివారు మామూలుగా దర్శనమిచ్చారు.

వక్కెమ్మ ఒకరోజు గొలగమూడిలోని ఆంజనేయస్వామివారి గుడికి వెళ్ళింది. ఆంజనేయస్వామి ఆమె ప్రక్కన నిలుచుని, 'పూలమాల వేసి పూజచేసుకో!' అని స్పష్టంగా చెప్పారు.

**సద్గురువు యొక్క అనుగ్రహానికి పాత్రులైన వారికి దేవతలు కూడా వశమై తమకై తామే సాక్షాత్కరిస్తారని 'శ్రీ గురుచరిత్ర' చూస్తే తెలుస్తుంది.** 42

ఒకప్పుడు మహాభక్తురాలు వక్కెమ్మ శ్రీస్వామివారి మహాత్మ్యం చూడాలనుకున్నది. ఒకరోజు ఆశ్రమంలో శ్రీస్వామివారి కెదురుగా 30 అడుగుల దూరంలో నేలమీద మెలుకువగా పడుకొనియున్నది. ఆమెకు ఇరవై అడుగుల దూరంలో రామలక్ష్మణులు నిలుచుని దర్శనమిచ్చారు. వారు అదృశ్యమై అదే స్థానంలో శ్రీ కృష్ణుడు నిలబడి దర్శనమిచ్చాడు. తాను కోరిన దర్శనం ప్రసాదించారని భక్తితో నమస్కరించింది. వక్కెమ్మగారికి ఇలాంటి అద్భుతములు జరిగినపుడు ఇతరులకు చెప్పేందుకు శ్రీస్వామివారు

అనుమతించక గుప్తంగా ఉంచమని హెచ్చరించేవారు. కనుక శ్రీస్వామివారు సమాధైనంత వరకూ పెదిమ కదిపేది కాదు. అలానే మరొకసారి నెల్లూరులో గురులదిబ్బ దగ్గర సూర్యనమస్కారం చేస్తున్నది. అప్పుడు ఆమె రెప్పపాటులో తాను అంతరిక్షంలోని వేరొక గ్రహాన్ని చేరినట్లు అనుభవమైంది. అక్కడ గూడా భూమి మీద వలె రాళ్ళు, బండలు ఆమెకు కన్పించాయి.

ఒకరోజు వక్కెమ్మకు ఒక స్వప్న దర్శనమైంది. శ్రీస్వామివారు పండుకొని ఒక్క వూపులో నాలుగు మైళ్లు జారిపోతున్నారు. ఇలా మూడు మార్లు ముందుకు, వెనుకకు జారి వక్కెమ్మ దగ్గరకు వచ్చి నోరు తెరచి విశ్వరూపం చూపుతున్నారు. ఇంతలో తులశమ్మ 'అబ్బయ్య బలే చూపుతున్నాడు ఆ! అబ్బో!' అంటూ తనకాలి మడిమను స్వామి నోటికి అడ్డం పెట్టింది. వక్కెమ్మ కోపంతో ఆమెను ప్రక్కకు నెట్టివేసింది. అంతటితో
43 విశ్వరూప దర్శనం మధ్యలోనే ముగిసింది. **తులశమ్మ కాలు అడ్డం పెట్టడమంటే ప్రకృతి అడ్డుపడటం కాబోలు.**

ఒకరోజు రోశిరెడ్డి గొలగమూడి ఆశ్రమంలో పగలే కునికిపాట్లు పడుతున్నాడు. అతని కన్నులు మూతపడి సుమారు 90 కి.మీ. దూరములో నున్న వారి గ్రామం కనబడుతుంది. వారి కుటుంబమంతా వర్షంలో తంటాలు పడుతూ నువ్వుల మాసూలు చేస్తున్నారు. వాళ్ళ ఇంట్లో పచ్చి నిమ్మకాయలు కోసి ప్రోగుపోసి ఉన్నాయి. కొంత సేపటికాదృశ్యం అంతరించి మేలుకున్నాడు. మూడవనాడు రెడ్డిగారిని చూడాలని వారి చిన్న కుమారుడు గొలగమూడి వచ్చాడు. ఇంటి దగ్గర జరిగిన నువ్వు మాసూలు, నిమ్మకాయల కోత గురించి రెడ్డిగారు వివరిస్తూ ప్రశ్నలు వేస్తుంటే **'ఈ విషయాలన్నీ మీకెలా తెలిశాయి' అని విస్తుబోయాడు వారి కుమారుడు. సద్గురు మహిమంటే ఏమిటో ఆ**
44 **పిల్లవానికి కొంతైనా అర్థమైందో లేదో!**

ఒకరోజు రోశిరెడ్డి చేతికొక చెక్క పలకనిచ్చి దానిమీద ఏముందో చూడమన్నారు శ్రీస్వామివారు. అతడు చూచి "ఏమీ లేదు స్వామి" అన్నాడు "బాగా చూడయ్యా!" అన్నారు శ్రీస్వామివారు. మరలా జాగ్రత్తగా చూస్తే రోశిరెడ్డికి ఇష్టదైవమైన వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, గణపతి విగ్రహాలు చెక్కపలకపై చాలా స్పష్టంగ కనపడినాయి. కొంత సేపయిన తరువాత మరలా కనపడకుండా పోయాయి.

వేలూరు రామానాయుడు (నాగులవెల్లటూరు) గారు, వారి

కుటుంబంలోని వారందరూ తరచూ శ్రీస్వామివారిని భక్తితో దర్శించేవారు. ఒకరోజు రాత్రి తల్లీ కొడుకులు మంచం మీద మేలుకొనే ఉన్నారు. కుమారునకు శ్రీస్వామివారు కిరీటం, భుజకీర్తులు ధరించి విష్ణువుగా గుండంలో కూర్చుని దర్శనమిచ్చారు. అతడాశ్చర్యపోయి ప్రక్కనే ఉన్న వారి తల్లికి ఆ వింత చెప్పి చూడమన్నాడు. కానీ ఆమెకక్కడ ఏమీ కనిపించడంలేదు. శ్రీస్వామివారు ఆ సమయంలో ఆ గ్రామంలోనే ఉన్నారు. మరుసటి ఉదయం ఆమె శ్రీస్వామివారిని దర్శించింది. అప్పుడామెతో శ్రీస్వామివారు "అమ్మో, పై వాళ్ళు వచ్చి రాత్రి గుండంలో విడిది చేసి పోయారు" అని అమాయకంగా చెప్పారు. రాత్రి తన బిడ్డకు అనుగ్రహించిన దర్శనం నిజమేనని ఆమెకు, ముందటి రాత్రి తనకు లభించిన దర్శనం భ్రాంతిగాని, ఊహగానీ కాదని, కేవలం శ్రీస్వామివారి అనుగ్రహం వలన మాత్రమే లభించినదనీ అతనికి తెలిసింది.

అనంతసాగరం వాస్తవ్యులు చడ్డా వెంకటరెడ్డిగారింటికి శ్రీస్వామివారు తరచుగా వెళ్లేవారు. రెడ్డిగారు శ్రీస్వామివారికి ప్రేమతో ఆతిథ్యమిచ్చేవారు. చాలామంది ఆ గ్రామస్తులుగానీ, చుట్టుప్రక్కల గ్రామాలవారుగానీ వచ్చి శ్రీస్వామివారిని దర్శించి ఆశీస్సులు పొందేవారు. అనేకమంది తమ బాధలు చెప్పుకొని శ్రీస్వామివారు ప్రసాదించే దారము, వేలిముద్రల కాగితాలు తీసుకెళ్ళి పవిత్రంగా భద్రపరచుకొనేవారు.

ఒకరోజు రెడ్డిగారు "స్వామీ అందరూ మీరు చాలా గొప్ప మహాత్ములంటారే. మరి నాకేదైనా నిదర్శనం చూపండి" అని వినయంగా ప్రార్థించారు. "అయ్యా నిదర్శనం చూస్తావా? సరే కళ్ళు మూసుకో" అని శ్రీస్వామివారు రెడ్డిగారి తలపై చేత్తో తాకి కళ్ళు తెరవమన్నారు. చూస్తే కనుచూపు మేర చుట్టూ ఏ ప్రపంచమూలేదు. చెట్లు, ఇండ్లు అన్నీ మాయమైనవి. చుట్టుప్రక్కల ఎంతదూరం చూచినా అసంఖ్యాకంగా నీటితో నిండిన గుంటలు, ప్రతి గుంటలోను మెడవరకు నీటిలో మునిగి శ్రీస్వామివారి తలమాత్రం పైకి కన్పిస్తుంది. కొంతసేపు చూచాక ఆ దృశ్యాన్ని చూడలేక "స్వామీ తమరు దైవస్వరూపులు మీకు ఆది అంతములేదు. అనంతులు. దయచేసి నాకు మామూలు దృష్టి ప్రసాదించండి". అని అలనాడు విశ్వరూపం చూచిన అర్జునునివలె చేతులెత్తి ప్రార్థించాడు. మరలా శ్రీస్వామివారు ఆయన తలపై తాకగానే మామూలు ప్రపంచము గోచరమైనది.